క్లుప్తంగా

గోశాలలో స్ప్రింక్లర్ల ప్రారంభం


స్ప్రింక్లర్లను ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో గడ్డి పెంపకానికి ఏర్పాటు చేసిన వాటర్‌గన్స్(స్ప్రింకర్ల)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు శనివారం ప్రారంభించారు. మొత్తం పది ఎకరాల విస్తీర్ణానికి సరిపడా 65 వాటర్‌గన్స్‌ను తొమ్మిది లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఈఈ రాంబాబు, డీఈ హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి


వాసవీ మాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో వాసవీ మాత జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు.ఆర్యవైశ్యులు,భక్తులు సబ్బవరంలోని శివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వాసవీ మాత చిత్రపటాన్ని ప్రతిష్టించారు.పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు వాసవీ మాతకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్యుల సంఘం ఆధ్వర్యంలో భక్తులందరికీ పులిహోర, మజ్జిగను పంపిణీ చేశారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకులపై కేసు

ఆరిలోవ: గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ పదో వార్డు పరిధి డెయిరీఫారం వద్ద శనివారం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులు ట్రాఫిక్ సిగ్నల్ పడినా ఆగకుండా జూ పార్కు వైపు వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని వెంబడించి ఇందిరానగర్ వద్ద పట్టుకొన్నారు. యువకులు గాబరాపడడంతో అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న చిన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులో సుమారు అర కిలో గంజాయి లభించింది. దీంతో వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

హుండీ ఆదాయం రూ.1.41 లక్షలు

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం ద్వారా 1 లక్ష 41 వేల 224 రూపాయలు లభించినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ మొత్తం రెండు నెలలకుగాను లభించిందన్నారు. శనివారం దేవాలయం ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు సమక్షంలో హుండీలు లెక్కించినట్లు తెలిపారు.


అందాలొలికే ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం


తిక్కవానిపాలెం బీచ్‌కు నిర్మించిన తారురోడ్డు

సుందర తీరాలు.. తనివి తీరని అందాలు


ఎన్టీపీసీ పంపుహౌస్‌కు సముద్రంలో నిర్మించిన అతి పొడవైన వంతెన


సందర్శకులు సేద దీరడానికి తీరంలో ఏర్పాటు చేసిన గొడుగులు


పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సముద్ర తీర ప్రాంతాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తీర ప్రాంతాల్లో ఇసుక తెన్నుల చుట్టూ పచ్చని జీడి, సరుగుడు తోటలు ఉండడంతో సందర్శకులు పోటెత్తుతున్నారు. తిక్కవానిపాలెం సముద్ర తీరంలో ఎన్టీపీసీ నిర్మించిన సీ వాటర్ బ్రిడ్జి, పర్యాటకులు సేద తీరడానికి ఏర్పాటు చేసిన గొడుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పరవాడకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సముద్ర తీరాలకు పర్యాటకులు రాకపోకలు సాగించడానికి తారు రోడ్లు నిర్మించారు. ఈ రెండు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. గాజువాక, అనకాపల్లి పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల వారితో పాటు అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేసి సముద్ర తీరంలో సాయంత్రం జలక్రీడలతో చిల్ అవుతారు.

వసతులు కల్పిస్తే..

తీర ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తే సందర్శకుల తాకిడి మరింత పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. తాగునీటితో పాటు సేదతీరడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. సోలార్ విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయడంతో పాటు సందర్శకుల రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని కోరుతున్నారు.

తాటి ముంజులు.. భలే.. భలే

- వేసవితాపం నుంచి ఉపశమనం
- అందుబాటులోకి వచ్చిన తాటికాయలు
- గీతకార్మికులకు ఉపాధి


తాటిముంజులు

పెందుర్తి: ప్రకృతి సిద్ధమైన నీరు... పోషకాలు కలగలిపిన లేలేత గుజ్జు...చిన్నా పెద్దా అందరి నోరూరించే వేసవి నేస్తం తాటి ముంజులు...భానుడు విజృంభిస్తున్న ఈ ఏడాది కొబ్బరి, పుచ్చ, చెరకురసం, పండ్లరసాలు, ఇతర శీతల పానీయాలతో పాటు తాటి ముంజులు కూడా ప్రజల దాహార్తిని తీరుస్తునాయి. గతంలో పల్లెలకు మాత్రమే పరిమితమైన ఈ ముంజులు ప్రస్తుతం నగరంలో కూడా విరివిగా లభిస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి వలస వచ్చిన వందలాది మంది గీత కార్మికులు వీటిని గ్రామాల్లో సేకరించి నగరంలో అమ్మకాలు సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు.

మంచిదే...

తాటి ముంజులు ఏటా వేసవిలో మాత్రమే దొరికే ప్రకృతి ప్రసాదించిన శీతల పదార్థం. ఇతర పానీయాలతో పోల్చుకుంటే తక్కువ ధరకు లభించే వీటిలో అధిక సంఖ్యలో పోషక విలువలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అప్పుడే తీసిన ముంజు నేరుగా తింటే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని వివరిస్తున్నారు. నీటిశాతం అధికంగా ఉండటం వల్ల ఇవి తిన్న వెంటనే శరీరం చల్లబడి వేసవితాపం నుంచి తక్షణమే ఉపశమనం పొందవచ్చు. కొబ్బరి నీళ్లలో ఉన్న పోషకాలన్నీ ముంజెల్లో ఉంటాయి. లేత ముంజులు మితంగా తింటే చల్లదనంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు.

ఉపాధి బాట...

విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లా నుంచి ఏటా వేసవిలో వందలాది మంది గీత కార్మికులు పెందుర్తి ప్రాంతానికి వలస వస్తారు. వీరు వేకువ జాము ఐదు గంటలకు తాటి చెట్ల వద్దకు చేరుకుని తాటి గెలలు దించుతారు. కొందరు అక్కడే ముంజెలు ఒలిచి బుట్టల్లో సర్దుకుంటారు. ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో నగరానికి చేరుకుంటారు. డజను ముంజులు పరిమాణాన్ని బట్టి డజను రూ.40 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. రోజుకు రూ.వెయ్యి వరకు గిట్టుబాటవుతుందని వీరు చెబుతున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ సారథ్యంలో కూర్మన్నపాలెంలోని ఉక్కు పైలాన్ వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. 1191 రోజుల నుంచి దీక్షలు నిర్వహిస్తున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన నుంచి విరమించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని కోరుతూ చేపట్టిన దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించే వరకు దీక్షలు విరమించబోమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వాసవీ మాత జయంతి


వాసవీ మాత పూజలో పాల్గొన్న భక్తులు


భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్

అల్లిపురం : శ్రీ వాసవీ మాత జయంతి వేడుకలు వైర్లెస్ కాలనీలోని శ్రీ రామాలయంలో శనివారం వైభవంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం నందగిరినగర్‌కు చెందిన శ్రీ వాసవాంబిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా అమ్మవారి చిత్రపటాన్ని అలంకరించారు. అనంతరం నిర్వహించిన కుంకుమపూజలో సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహస్ర నామాచార్చన, అష్టోత్తరం చేపట్టారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్ పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఎవరు పూజిస్తారో వారికి సర్వసౌభాగ్యాలు కలుగుతాయన్నారు. యలమర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సతివాడమ్మతల్లి ఉత్సవాలకు వేళాయె

- నేడు అమ్మవారి ఘటాల ఊరేగింపు సంబరం
- రేపు తొలేళ్లు..ఎల్లుండి అనుపోత్సవం

పెందుర్తి: మండలంలోని గొరపల్లిలో కొలువైన సతివాడమ్మతల్లి జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఏడు గ్రామాల ఇలవేల్పుగా ప్రసిద్ధి గాంచిన అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం రాత్రి గొరపల్లి, కోట్నివానిపాలెం, గంగమ్మపేటలో ఘటాల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. పండ్లు, పిండివంటలతో నైవేద్యం సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. సోమవారం తొలేళ్ల సంబరం అంబరాన్నంటనుంది. మంగళవారం అనుపోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. గత శుక్రవారం రాత్రి పండగ చాటింపు నుంచి గొరపల్లి వేదికగా అమ్మవారికి నిత్య పూజలు చేస్తున్నారు.

ఏడు గ్రామాల ప్రజలకు పెద్దమ్మ

గొరపల్లి గ్రామంలో కొలువైన సతివాడమ్మతల్లి ఏడు గ్రామాలకు ఆరాధ్య దేవత. గొరపల్లి, కోట్నివానిపాలెం, గంగమ్మపేట, కరకవానిపాలెం, సంతపాలెం, గొల్లలపాలెం, గవరపాలెం ప్రజలు అమ్మవారిని ఆరాధిస్తారు. ఇరుగుపొరుగు గ్రామాలైన గొరపల్లిలో వెలసిన సతివాడమ్మతల్లి, గంగమ్మపేటలో కొలువైన బంగారమ్మతల్లి, కోట్నివానిపాలెంలో పూజలందుకుంటున్న మరిడిమాంబ అక్కచెల్లెళ్లుగా ప్రతీతి. మరిడిమాంబ పండగా ఏటా నిర్వహిస్తారు. అయితే ఒక ఏడాది సతివాడమ్మతల్లి, మరో ఏడాది బంగారమ్మతల్లి పండగ చేస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది సతివాడమ్మతల్లి పండగను నిర్వహిస్తున్నారు.


సతివాడమ్మతల్లి

ప్రతి ఘట్టం ప్రత్యేకమే

సతివాడమ్మతల్లి జాతరను తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తారు. చెల్లెలు మరిడిమాంబ పండగ రోజునే సతివాడమ్మతల్లి పండగ చాటింపు వేస్తారు. అదే రోజు గొరపల్లిలో తాటాకులతో అమ్మవారి గూడు(గుడి) కట్టి తాత్కాలికంగా అమ్మవారిని ప్రతిష్టిస్తారు. ఆరు రోజుల పాటు గ్రామంలో అమ్మవారిని ఊరేగించి పూజలు చేస్తారు. నిత్యం రాత్రి సమయంలో గ్రామంలో వాలకాల పేరిట సందడి చేస్తారు. ఇక చివరి మూడు రోజుల్లో తొలిరోజు గొరపల్లి, కోట్నివానిపాలెం, గంగమ్మపేటలో అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలు రకరకాల పిండివంటలు, ఫలాలు, పప్పు అన్నం అమ్మవారికి సమర్పిస్తారు. తొలేళ్ల రోజు ముందుగా ఎలేనుగు సంబరం చేస్తారు. అనంతరం ఉయ్యాల కంబాల ఘట్టం, చక్రం వంటి ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అదే రోజు రాత్రికి ఏలోపూత పేరిట కార్యక్రమం చూడముచ్చటగా ఉంటుంది.


అమ్మవారి జాతరలో భాగంగా రోజువారీ ఊరేగింపు ఘట్టం(ఫైల్)

అమ్మవారి జాతర ముగింపు రోజున ఎలేనుగు సంబరం, ఉయ్యాల కంబాల సంబరాలు కొనసాగుతాయి. అనుపోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.

నాటి ప్రపంచం.. నేడు ఆవిష్కృతం

- మన పూర్వీకుల గురించి చెబుతున్న విశాఖ మ్యూజియం
- కళ్ల ముందు అలనాటి రాజుల ఘనతలు, సైన్స్ సంగతులు


అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి మ్యూజియంను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : మన పూర్వీకుల సంస్కృతీ సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో వారు సాధించిన ప్రగతిని విశాఖ మ్యూజియం నేటికీ మన కళ్ల ముందు ఆవిష్కరిస్తోంది. 1991లో ప్రారంభమైన ఈ మ్యూజియంలో వందల ఏళ్లనాటి కళాఖండాలు, సంస్కృతిని ప్రతిబింబించే శిల్పాల వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలున్నాయి.

తప్పక వీక్షించాల్సినవి..: ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఫైబర్‌తో సచిన్‌టెండూల్కర్ విగ్రహాన్ని రూపొందించారు. నిజంగా సచినే వచ్చి నిల్చున్నాడా అనే రీతిలో ఉంటుందీ విగ్రహం

- 1840లో గోడే వెంకట జగ్గారావు స్థాపించిన నక్షత్రశాల చిత్రపటం
- 1902–37 మధ్య కాలంలో విజయనగరం సామ్రాజ్యానికి చెందిన ఖడ్గాలు, తుపాకులు, ఇతర యుద్ధ సామగ్రి

చూసి తీరాల్సిందే..

- మేరీటైం మ్యూజియం .. ఇది విశాఖ మ్యూజియంలో అంతర్భాగం. భారత నావికా దళానికి సంబంధించినది. తొలితరం ఆవిష్కరణలను యుద్ధ మజిలీలను ప్రజల ముందు ఆవిష్కరించేందుకు ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలని తూర్పు నావికాదళం భావించింది. ఇది 2004లో ప్రారంభమైంది.
- 1400 డిగ్రీల ఉష్ణోగ్రతను సైతం తట్టుకునే విధంగా తయారు చేసిన ప్రాక్సిమిట్ సూట్ (దీని బరువు 6.5 కిలోలు)
- శ్వాస పరికరాలతో కూడిన హైడ్రోజన్ సూట్. సముద్ర గర్భంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఈ సూట్‌ను ధరించి 120 అడుగుల లోతులో ఉన్న జలాంతర్గాముల నుంచి సురక్షితంగా బయటపడొచ్చు.
- తొలితరం యుద్ధ నౌకల్లో వినియోగించిన అధునాతనవ మిషన్‌గన్స్

ఎక్కడ ఉంది: బీచ్‌రోడ్డు.. పార్క్ హోటల్ వద్ద


ఏళ్లనాటి సీతారామచంద్ర హనుమత్ లక్ష్మణ స్వామి విగ్రహాలు

వేళలు: ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు
శని, ఆదివారాల్లో ఉదయం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు
ప్రవేశ రుసుం : పెద్దలకు రూ.10
పిల్లలకు (5 నుంచి 12 ఏళ్లలోపు) రూ.5.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఘనంగా సహస్రనామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

- వైభవంగా శ్రీవారి కల్యాణం
- వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం గోదా, పద్మావతి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పరిపాలన విభాగాల పరిశీలన


కార్యాలయాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలన భవనంలో పనిచేస్తున్న విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునీకీకరణ, అవసరమైన మార్పులు చేపట్టడం, మరమ్మతులు, తదితర అంశాలపై సిబ్బంది సూచనలు స్వీకరించారు. ప్రతీ విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్థంగా సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట అధికారులు సాంబమూర్తి, గోపాల కృష్ణ, రమణా రెడ్డి, తులసీరామ్, ఇమాన్ ఉన్నారు.

జీవీకేలో ప్రవేశాలు ప్రారంభం

ఆరిలోవ : జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రమ శనివారం తెలిపారు. విశాలమైన క్రీడా మైదానం, లేబొరేటరీ, గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు.